క్లుప్తంగా

క్రీడాభివృద్ధికి పెద్దపీట



నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం(మునగపాక): క్రీడాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. అచ్యుతాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు పీటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

దైవ చింతన అలవరుచుకోవాలి



వినాయకున్ని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవాటు చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలోని పాటిమీద వినాయక ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పాల్గొని భక్తులకు వడ్డించారు. ముందుగా గణనాథ విగ్రహాన్ని దర్శించుకొని పూజలు చేశారు.

2 నుంచి ఎన్‌ఎంఎంఎస్ శిక్షణ

మునగపాక: మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అక్టోబర్ 2 నుంచి 10వ తేదీ వరకు ఎన్‌ఎంఎంఎస్(జాతీయ ప్రతిభ ఉపకార వేతనం) ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు ఎం.సత్యనారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 89193 60208 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

యలమంచిలికి అదనపు బస్సులు నడపాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

యలమంచిలి: యలమంచిలి నుంచి రాంబిల్లి మండలం దిమిలి గ్రామానికి ఆర్టీసీ అదనపు బస్సులను నడపాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు కేశవ, కార్యదర్శి మణికంఠ కోరారు. ఈ మేరకు సోమవారం యలమంచిలి మండలం తహసీల్దార్ వరహాలుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యలమంచిలి పట్టణానికి దిమిలి పరిసర గ్రామాల నుంచి చదువుకోవడానికి విద్యార్థులు అధిక శాతం వస్తున్నారన్నారు. పాయకరావుపేట నుంచి కూడా విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు. ఈ ప్రాంతాలకు బస్సులు తక్కువగా నడపడం వల్ల విద్యార్థులు సకాలంలో కళాశాలలు, స్కూళ్లకు చేరుకోలేకపోతున్నారన్నారు. విద్యార్థుల పడుతున్న కష్టాలను చూసి అదనంగా బస్సులు నడిపేలా చూడాలని కోరారు.

గంగాదేవిపేటలో వీధి దీపాల ఏర్పాటు



పనులు పరిశీలిస్తున్న గంగప్పలనాయుడు

మునగపాక: గంగాదేవిపేట గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పల నాయుడు తెలిపారు. గ్రామంలో పాడైన వీధి దీపాలకు సోమవారం మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగాదేవిపేటలో పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సమస్య రాకుండా పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకుడు మొల్లేటి చంద్ర, వార్డు సభ్యుడు కేవీఏ నరసింహనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చేదెక్కుతున్న చెరకు సాగు..!

- వేధిస్తున్న తెగుళ్ల బెడద
- లభించని మద్దతు ధర
- ప్రత్యామ్నాయం వైపు రైతుల చూపు
- వరితో పాటు ఇతర పంటల సాగుకు ఆసక్తి



మునగపాకలో సాగవుతున్న వరిపైరు



మునగపాకలో ఎదుగుదలకు నోచుకోని చెరకు తోట

మునగపాక: రైతులకు చెరకు సాగుపై ఆసక్తి తగ్గిపోతోంది. ప్రత్యామ్నాయ పంటలపై మక్కువ పెరుగుతోంది. గత ఎనిమిదేళ్లుగా చెరకు తోటలకు సోకుతున్న తెగుళ్లు, ఆశించిన ధరలు లభించకపోవడం ఇందుకు కారణంగా సర్వత్రా అభిప్రాయం వ్యక్తమవుతోంది. పెట్టుబడులు పెరిగిపోతున్నా ఆశించిన ఆదాయం లేకపోవడంతో చెరకు రైతులు వరితో పాటు ఇతర పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. చెరకుకు సంబంధించి అధికారులు కొత్త వంగడాలను పరిచయం చేస్తున్నా రైతులు మాత్రం ఆసక్తి చూపడం లేదు.

చెరకు సాగు ఇలా...

మండల వ్యాప్తంగా చెరకు సాగు సాధారణ విస్తీర్ణం 1360 హెక్టార్లు కాగా.. చెరకు తోటలకు సోకుతున్న తెగుళ్ల కారణంగా ప్రస్తుతం 603 హెక్టార్లకు పడిపోయింది. ఎకరా చెరకు సాగుకు ముచ్చు విత్తే నాటి నుంచి గానుగ ఆడే వరకు సుమారు రూ.48 వేల నుంచి రూ.52 వేల వరకు పెట్టుబడులు పెట్టాల్సి వస్తుంది. తెగుళ్ల కారణంగా 15 పాకాలకు మించి దిగుబడులు వచ్చే అవకాశాలు లేవు. మార్కెట్‌లో పాకం రూ.3,500 వరకు పలుకుతుంది. 15 పాకాలకు గాను రూ.52,500 వరకు వస్తుంది. ఏడాది పాటు ఇంటిల్లిపాది కష్టపడి పనిచేస్తే పెట్టుబడికి ఆదాయానికి పొంతన ఉండడం లేదు.

వరి సాగు ఇలా..

మండల వ్యాప్తంగా వరి సాధారణ విస్తీర్ణం 1364 హెక్టార్లు కాగా.. ప్రస్తుతం 1402 హెక్టార్లకు పైగా సాగు జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వరి సాగుకు సంబంధించి ఎకరాకు రూ.25 వేల వరకు పెట్టుబడులు అవుతున్నాయి. వాతావరణం అనుకూలిస్తే 35 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నాయి. బస్తా 70 కిలోలు కాగా.. ఒక్కొక్క బస్తా రూ.1800 వరకు పలుకుతుంది. ఈ లెక్కన 35 బస్తాలకు రూ.63 వేల వరకు ఆదాయం వస్తుంది. పెట్టుబడులకు అయ్యే ఖర్చు పోనూ రైతుకు రూ.38 వేల వరకు ఆదాయం సమకూరుతుంది. దీంతో రైతులు వరిపై మక్కువ చూపుతున్నారు.

చెరకుకు పెట్టుబడి ఎక్కువ



చెరకు తోటలకు తెగుళ్ల బెడద ఎక్కువగా ఉండడంతో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాల్సి వస్తుంది. చెరకుకు పెట్టుబడి ఎక్కువ అవుతుంది. ఆదాయం తగ్గుతుంది. ఇంటిల్లి పాది కష్టపడి పనిచేసినా ఫలితం లేదు. అదే వరి అయితే పశువులకు గడ్డి దొరుకుతుంది. ఆశించిన మేర ఆదాయం వస్తుంది. అధికారులు చెరకులో కొత్త వంగడాలు పరిచయం చేస్తున్నా ఫలితం కనిపించడం లేదు.

– ఆడారి సత్యనారాయణ, రైతు, మునగపాక

అందుబాటులోకి కొత్త వంగడాలు



చెరకులో కొత్త వంగడాలను అందుబాటులోకి తీసుకొస్తున్నాం. అయితే రైతులు మాత్రం ముందుకు రావడం లేదు. పాత వంగడాలపైనే దృష్టి సారిస్తున్నారు. ఫలితంగా చెరకు సాగు తగ్గుతోంది. దీంతో ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి చూపుతున్నారు. చెరకులో తెగుళ్ల నివారణకు అవసరమయ్యే సలహాలు, సూచనలిస్తున్నాం. రైతులు ముందుకొచ్చి పాటించాలి.

– సీహెచ్.జ్యోత్స్నకుమారి, వ్యవసాయాధికారి

జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక



జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: వమ్మవరం ఉన్నత పాఠశాలలో పలువురు విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడల పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు కె.రమేష్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో పలు క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు అండర్–17 వాలీబాల్ బాలుర విభాగంలో డి.సూర్య, పి.వంశీ, బాలికల విభాగంలో పి.యశస్విని, పి.తబితా జ్యోత్స్న, ఖోఖో బాలుర అండర్–14 విభాగంలో డి.కరుణకుమార్, వాలీబాల్ పి.వెంకటేష్, బాలికల్లో వాలీబాల్, ఖోఖో డి.తులసి, ఎంపిక కాగా, యోగాలో ఎస్.నిహారిక, చదరంగంలో ఎ.మేరీమౌనిక, 400 మీటర్ల రన్నింగ్‌లో పి.దీక్షిత్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు జి.కిరణ్‌కుమార్‌ను ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ

అచ్యుతాపురం(మునగపాక): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారి ఎస్.శాంతిప్రభ కోరారు. అచ్యుతాపురం మండలం హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సోమవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ సుగణను ఆదేశించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత చాలా అవసరమన్నారు. ప్రతి శుక్రవారం తప్పనిసరిగా డ్రైడే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ మలేరియా ఆరోగ్య విస్తరణ అధికారి బి.తిరుపతిరావు, అనకాపల్లి సబ్ యూనిట్ అధికారి ఐ.శ్రీనివాసరావు, పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి వేడుకలకు సిద్ధం



భక్తుల కోర్కెలు తీర్చే విజయదుర్గ అమ్మవారు

అచ్యుతాపురం(మునగపాక): విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అచ్యుతాపురం మండలం సిద్ధమైంది. ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రులను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు అచ్యుతాపురం మండలం హరిపాలెం హరిగిరి కొండపై కొలువుదీరిన విజయదుర్గ అమ్మవారి ఆలయం వేడుకలకు ముస్తాబవుతోంది. తొమ్మిది రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ చైర్ పర్సన్ మారిశెట్టి లక్ష్మీకాంతం తెలిపారు. ప్రతి రోజు అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

గోకులం షెడ్ల కోసం మరో ఐదేళ్లు తిప్పుతారా?



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి



సభ్యులను శాంతింపజేస్తున్న పోలీసులు

- పలు అంశాలపై సభ్యుల ఆగ్రహం
- వాడీవేడిగా కోటవురట్ల సర్వసభ్య సమావేశం

కోటవురట్ల: గోకులం మినీ షెడ్ల పథకం కోసం మరో ఐదేళ్లు తిప్పి చంపుతారా అంటూ పందూరు సర్పంచ్ జగదీష్ అధికారులను ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం జరిగింది. జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి, వైస్ ఎంపీపీ ఆర్‌ఎస్ సీతారామరాజు శాఖల వారీ సమీక్ష చేశారు. పశు సంవర్ధక శాఖాధికారులు మాట్లాడుతూ మండలానికి 25 షెడ్లు కేటాయించగా.. 47 దరఖాస్తులు వచ్చినట్టు వివరించారు. వెంటనే సర్పంచ్ జగదీష్ స్పందిస్తూ 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు మండలంలో చాలా మంది రైతులు గోకులం షెడ్ల కోసం డబ్బులు కట్టారని, వాటికి నేటికీ దిక్కులేకపోయిందన్నారు. గత మూడు సమావేశాల నుంచి డుమ్మా కొడుతున్న అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావును సర్పంచులు పైల శివరాం, చీకట్ల జగదీష్ ప్రశ్నించారు. జలజీవన్ మిషన్ పథకం అమలుతో గ్రామీణ రహదారులను ధ్వంసం చేశారని, పథకం కూడా పూర్తి కాలేదని ఎంపీటీసీ పెట్ల రాంబాబు మండిపడ్డారు.

ఎన్నికల ముందు ఇసుక ఉచితం అంటూ హామీ ఇచ్చారని, ఇప్పుడు ఎందుకు ధర నిర్ణయించారని సర్పంచ్ కన్నంరెడ్డి వరహాలబాబు తహసీల్దారు తిరుమలబాబును ప్రశ్నించారు. ఎన్టీఆర్ హౌసింగ్ స్కీమ్‌కు సంబంధించి లబ్ధిదారుల సమస్యలపై సర్వే చేస్తున్నామని ఏఈ ప్రసాద్ తెలపగా.. సర్పంచు జగదీష్ కలగజేసుకుని సర్పంచులను కలిసి చెప్పాల్సిన బాధ్యత మీకు లేదా?, టీడీపీ బ్రోకర్ల దగ్గరకు వెళ్లి సర్వే చేస్తారా? ఏం జగనన్న కాలనీలలో సమస్యలు లేవా? వాటిని ఎందుకు పరిష్కరించరు? అంటూ ప్రశ్నించారు. దాంతో టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు ప్రకాష్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ వాగ్వాదానికి దిగారు. పరస్పరం కేకలు వేసుకోవడంతో పోలీసులు రంగప్రవేశం చేసి సభ్యులను చెదరగొట్టారు. మెయిన్‌రోడ్డులో జంగిల్ క్లియరెన్స్ కోసం సభ్యులు డిమాండ్ చేయగా.. రహదారుల నిర్వహణకు నిధులు లేవని ఏఈ సమాధానమిచ్చారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐగా శ్రీనివాసరావు



బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు

పాయకరావుపేట: ఎక్సైజ్ సీఐగా జి.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసరావు ఇప్పటి వరకు పాలకొండ ఎక్సైజ్ సీఐగా పని చేశారు. ఇంత వరకు ఇక్కడ పని చేసిన సీఐ ఎస్.ధర్మరావు బదిలీపై డిస్టలరీ యూనిట్‌కు వెళ్లారు.

6న నాటిక ప్రదర్శనలు

మునగపాక: గ్రామీణ యువజన సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 6న మునగపాకలో రెండు నాటిక ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు సంస్థ కన్వీనర్ సూరిశెట్టి రాము ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌ఈసీఎస్ మాజీ చైర్మన్, దివంగత నేత పెంటకోట జనరాజ్‌దాస్ 65వ జయంతిని పురస్కరించుకుని స్థానిక నందీశ్వర తులసీ కళావేదికపై రాత్రి 7 గంటలకు శ్రీ నీడ, విముక్తి నాటికల ప్రదర్శనలు ఉంటాయన్నారు.

మాస్టర్ ప్లాన్‌తో పట్టణాభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, చిత్రంలో చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి



హాజరైన వార్డు కౌన్సిలర్లు

- పాత హైవే 100 అడుగుల విస్తరణకు కౌన్సిల్ ఆమోదం
- రాజకీయాలకతీతంగా పని చేద్దాం : ఎమ్మెల్యే విజయ్‌కుమార్

యలమంచిలి రూరల్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో యలమంచిలి పట్టణాభివృద్ధి కోసం ప్రభుత్వం ఆమోదించిన మాస్టర్ ప్లాన్‌లో భాగమైన పాత జాతీయ రహదారి 100 అడుగుల విస్తరణకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి అధ్యక్షతన సోమవారం జరిగిన యలమంచిలి కౌన్సిల్ సమావేశంలో 16 అంశాలతో రూపొందించిన అజెండాను పాలకవర్గం ఆమోదించింది. మాస్టర్ ప్లాన్‌లో కొక్కిరాపల్లి ఫ్లైఓవర్ నుంచి రేగుపాలెం 16వ నంబరు హైవే కూడలి వరకు 4.5 కిలోమీటర్ల మేర 100 అడుగుల వెడల్పున విస్తరించడానికి ప్రతిపాదించారు. ముందుగా పట్టణంలో రహదారులకిరువైపులా ఉన్న దుకాణ యజమానులకు నోటీసులిచ్చే ప్రక్రియను ప్రారంభించడానికి, వారి హక్కు పత్రాల పరిశీలన చేయడానికి అధికారులు అజెండాలో 7వ అంశంగా ప్రతిపాదన చేశారు. ఈ మేరకు దీనిపై సమావేశంలో చర్చించారు. రహదారి విస్తరణలో భాగంగా పలుమార్లు నోటీసులివ్వడం వంటివి చేయవద్దని, దీని వల్ల స్థానికుల నుంచి వ్యతిరేకత వస్తుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. రాజకీయాలకు అతీతంగా పట్టణాభివృద్ధికి అందరూ భాగస్వాములు కావాలన్నారు. మున్సిపాలిటీలో పనులన్నీ ఒకే కాంట్రాక్టర్‌కు ఇస్తుండడంపై ఎమ్మెల్యే అభ్యంతరం వ్యక్తం చేశారు. జేసీబీ సహా పలు పారిశుధ్య వాహనాల మరమ్మతు పనులు, నీటి సరఫరాకు అవసరమైన పైపులైను మరమ్మతు పనులకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. 15వ ఆర్థిక సంఘం నిధులతో పట్టణంలో చేపట్టడానికి గత కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించిన పనులకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఆ పనులకు మళ్లీ టెండర్లు పిలవాలని నిర్ణయించారు. పారిశుధ్యం మెరుగుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని పారిశుధ్య విభాగం అధికారులను చైర్ పర్సన్ రమాకుమారి కోరారు. మారుతున్న ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ కాంప్లెక్స్ కోసం పట్టణానికి సమీపంలో మూడెకరాల స్థలం కేటాయిస్తే ఇబ్బందులు ఉండవన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు అర్రెపు సత్య గుప్తా, బెజవాడ నాగేశ్వరరావు, పిట్టా సత్తిబాబు, సుంకర మరిణేశ్వరరావు, మజ్జి రామకృష్ణ, పలువురు వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

క్రీడల్లో దొడ్డిగల్లు, గొడిచర్ల విద్యార్థుల ప్రతిభ



ప్రతిభకనబరిచిన చినదొడ్డిగల్లు విద్యార్థులు



గొడిచర్ల విద్యార్థులు

నక్కపల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన వివిధ క్రీడా పోటీల్లో మండలంలోని చినదొడ్డిగల్లు, గొడిచర్ల పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గత నెల 27, 28 తేదీల్లో పాయకరావుపేట మండలం ఎస్.నర్సాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎంలు అప్పారావు, కవిత తెలిపారు. అండర్–17 వాలీబాల్ పోటీల్లో చినదొడ్డిగల్లు విద్యార్థులు సువర్ణరాజు, చరణ్, దుర్గాప్రసాద్, బ్యాడ్మింటన్‌లో శ్రీనివాసు, నవీన్, యోగాలో దుర్గ, పాప, నరేష్, కబడ్డీలో హేమంత్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గొడిచర్ల పాఠశాల నుంచి ఖోఖో అండర్–14 విభాగంలో సత్యవాణి, త్రిపుర, సిద్దు, వరదుర్గ, కబడ్డీలో సత్యసాయి నాగేంద్ర, భవ్యశ్రీ, దివ్య, సంపూర్ణ, బ్యాడ్మింటన్‌లో ఎ.సత్యసాయి నాగేంద్ర, పి.ఎల్.చరణ్, లాంగ్ జంప్‌లో రామలక్ష్మి., అండర్–17 కబడ్డీలో పి.కిషోర్, ఖోఖోలో సంతోష్, నిఖిల్‌సాయిసుధ, రవితేజ, జావెలెన్‌త్రోలో కె.భాస్కర్, డిస్కస్ త్రోలో లోకేష్, 800 మీటర్ల పరుగు పందెంలో ప్రేజీ గ్రేస్ ఎంపికయ్యారన్నారు. ప్రతిభకనబరిచిన విద్యార్థులను ఉపాధ్యాయులు వై.వి.రమణ, యాస్మిన్, తదితరులు అభినందించారు.

మునిసిపల్ ఉపాధ్యాయ సమస్యలపై సత్యాగ్రహ దీక్ష

ఏడీ రమాజ్యోతికి యూటీఎఫ్ నోటీస్ అందజేత



సత్యాగ్రహ దీక్ష నోటీసును ఏడీకి అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

తుమ్మపాల: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై ఈ నెల 2న చేపట్టే సత్యాగ్రహ దీక్షకు సంబంధించి యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయంలో ఏడీ రమాజ్యోతికి నోటీస్ అందించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయ్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీసు విద్యా శాఖ పరిధిలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా ప్రధాన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. వీటి పరిష్కారానికి యూటీఎఫ్ చేపట్టిన పోరాట కార్యాచరణను విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం మున్సిపల్ హైస్కూల్లో తగినంత మంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఖాళీగా ఉన్న హెడ్ మాస్టర్, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అర్హులైన వారికి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వి. శ్రీలక్ష్మి, మున్సిపల్ సంఘ నాయకులు మాకిరెడ్డి రాజునాయుడు, బాషా, నాతవరపు సతీష్, జిల్లా నాయకులు జోగా రాజేష్, దేముడు నాయుడు, మామిడి బాబూరావు పాల్గొన్నారు.

సంపద కేంద్రాల్లో వానపాముల విడుదల



చెత్త నుంచి సంపద కేంద్రాల్లో వానపాములు వేస్తున్న అధికారులు

పాయకరావుపేట: మంగవరం పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్, తదితరులు సోమవారం వానపాములు విడుదల చేశారు. అనంతరం క్లాప్ మిత్రలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. మంగవరం పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంగలపూడి సరస్వతీ, ఎంపీడీవో జయప్రకాష్ రావు, గ్రామ కార్యదర్శులు నరేష్, వై.సత్యనారాయణ, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలతో అదనపు ఆదాయం

అచ్యుతాపురం(మునగపాక): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం అచ్యుతాపురంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరేలా ప్రజా ప్రతినిధులు పాటుపడాలన్నారు. పారిశుధ్యం, డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మునగపాక పీహెచ్‌సీ సందర్శన

మునగపాక: మునగపాక పీహెచ్‌సీని సోమవారం జోనల్ మలేరియా అధికారి ఎం.శాంతిప్రభ సందర్శించారు. ఆస్పత్రి రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రికి వస్తున్న రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. గ్రామంలో జరుగుతున్న యాంటీ లార్వా సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సీజన్‌లో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి విమలగిరి, సీహెచ్‌వో దేవకాంత, అనకాపల్లి సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కాంతార వేషధారణ



గణేష్ నిమజ్జనంలో కాంతార వేషధారి సందడి

యలమంచిలి రూరల్: మండలంలోని పీఎస్ఆర్ పేటలో వినాయక నిమజ్జనం సందర్భంగా సోమవారం రాత్రి నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కోలాటం, కాంతార వేషధారణ సహా పలు నృత్య ప్రదర్శనలు అబ్బురపరిచాయి. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరక్కుండా యలమంచిలి రూరల్ ఎస్సై ఉపేంద్ర ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మనెంట్ చేయాలి



మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌రాజుకు వినతి పత్రం అందిస్తున్న సీఐటీయూ మండల కార్యదర్శి సిహెచ్.శివాజీ

యలమంచిలి : కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి . సిహెచ్.శివాజీ కోరారు. ఈ మేరకు సోమవారం యలమంచిలి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రసాద్‌రాజును ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. పట్టణ జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. మున్సిపాలిటీలో ఖాళీలను భర్తీ చేయాలని, యూనిఫారం, సబ్బులు, నూనె, చెప్పులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.